తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
ఆదివారం
02 ఆగస్టు 2026
సంపుటి 03
సంచిక 293
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com



## తల్లి పాలపై అవగాహన పెంచాలి

- ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి సీతక్క పిలుపు
- పుట్టిన గంటలోపే తల్లిపాలు ప్రారంభించాలని సూచన
- మొదటి ఆరు నెలలు తల్లిపాలే ఇవ్వాలని అవగాహన కల్పించాలి
- అంగన్వాడీ, ఆరోగ్య శాఖలు సమన్వయంతో ప్రచారం చేపట్టాలని ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 1 ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు (ఆగస్టు 1--7) సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రతి తల్లి, ప్రతి కుటుంబానికి తల్లిపాల ప్రాముఖ్యతను చేరవేసేలా ఉద్యమంలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తల్లి పాలు ప్రతి శిశువుకు తొలి హక్కు, ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ పోషకాహారమని మంత్రి తెలిపారు. పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు శిశువుకు తొలి రోగనిరోధక టీకాలా పనిచేస్తాయని పేర్కొన్నారు. ప్రతి శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలను ప్రారంభించి, తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వాలని సూచించారు.

ఆరు నెలల తర్వాత వయస్సుకు తగిన అనుబంధ

➢ మిగతా 2వ పేజిలో..

## ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛాయుత మీడియా అవసరం



- నవతెలంగాణ వార్షికోత్సవ సెమినార్‌లో కేటీఆర్ ప్రసంగం
- దేశంలో మీడియా స్వేచ్ఛ క్షీణిస్తోందని వ్యాఖ్య
- సోషల్ మీడియాతో జవాబుదారీతనం పెరిగిందన్న కేటీఆర్
- ఫేక్ వార్తలపై వాస్తవ నిర్ధారణ అవసరమని సూచన

హైదరాబాద్, ఆగస్టు 1: నవతెలంగాణ 11వ వార్షికోత్సవం సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన "రాజ్యాంగం--ప్రజాస్వామ్యం--పత్రికా స్వేచ్ఛ" అంశంపై సెమినార్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. నవతెలంగాణ 11 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంస్థకు శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో మీడియా స్వేచ్ఛ

➢ మిగతా 2వ పేజిలో..



# లక్షల విలువైన యంత్రాలకు దిక్కెవరు?

- రైతుల కోసం ప్రభుత్వం కొనుగోలు చేస్తే పిఎసిఎస్ అధికారులు గాలికొదిలేశారు
- పీఏసీఎస్ అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం
- కాంటాలు పూర్తయ్యాయి.. యంత్రాలు అక్కడే వదిలేశారు!
- యంత్రాలు మీవా.. బాధ్యత ఎవరిది? పాడైతే ప్రజాధనం ఎవరి నిర్లక్ష్యానికి బలి?
- కనీసం టార్పాలిన్ కవర్ కూడా కరువే.. వర్షం, ఎండకు అప్పగింత
- ప్రభుత్వ సొమ్ముతో కొనుగోలు చేసిన వరి ధాన్యం క్లీనింగ్ యంత్రాలపై పర్యవేక్షణ ఏదీ?

వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 1,తరంగాలు : రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన వరి ధాన్యం క్లీనింగ్ యంత్రాలు పీఏసీఎస్ అధికారుల నిర్లక్ష్యంతో కాంటాలు నిర్వహించిన కేంద్రాల వద్దే ఎక్కడికక్కడ వదిలేయడం వర్ధన్నపేట మండలంలో చర్చనీయాంశంగా మారింది. కాంటాలు పూర్తయిన తర్వాత యంత్రాలను భద్రపరచాల్సిన బాధ్యత ఎవరిది? అవి వర్షం, ఎండకు దెబ్బతిని చెడిపోతే బాధ్యత ఎవరు వహిస్తారు? అంటూ రైతులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### టార్పాలిన్ కవర్ కూడా లేకుండా..

ప్రభుత్వం రైతుల కోసం అందించిన విలువైన యంత్రాలను వినియోగం అనంతరం సురక్షిత ప్రదేశానికి తరలించాల్సి ఉండగా, కాంటాలు నిర్వహించిన ప్రాంతాల్లోనే వదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం టార్పాలిన్ కవర్ కూడా కప్పకుండా యంత్రాలను

➢ మిగతా 2వ పేజిలో..



## తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగింపు

- సర్వదర్శనానికి 15 గంటల నిరీక్షణ
- 31 కంపార్ట్‌మెంట్లలో వేచిచూస్తున్న భక్తులు
- ఒక్కరోజే 71 వేల మందికి పైగా శ్రీవారి దర్శనం
- హుండీ ఆదాయం రూ.4.46 కోట్లు

➢ 2వ పేజిలో..

## వివేక స్మారక కేంద్రం ప్రారంభం

ప్రధాని మోదీతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి డీకే శివకుమార్

➢ 2వ పేజిలో..

## పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్ దెబ్బతింటోంది

- విద్యా వ్యవస్థపై రాహుల్ విమర్శలు
- విద్యార్థులకు క్షమాపణ కాదు.. ప్రధాని క్షమాపణ చెప్పాలని డిమాండ్
- పరీక్షల రద్దుతో కుటుంబాలు తీవ్ర వేదన అనుభవిస్తున్నాయని వ్యాఖ్య
- విద్యా వ్యవస్థలో సంస్కరణలు అవసరమని పిలుపు



న్యూఢిల్లీ, ఆగస్టు 1 : దేశంలోని విద్యా వ్యవస్థ, పేపర్ లీకేజీ ఘటనలపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దుతో విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల బాధ కంటే పెద్ద వేదన మరొకటి ఉండదని రాహుల్ గాంధీ అన్నారు. ప్రతి విద్యార్థి వెనుక ఒక కుటుంబం ఉంటుందని, పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దు కారణంగా వారి ఎన్నో సంవత్సరాల కృషి ఒక్కసారిగా వృథా

➢ మిగతా 2వ పేజిలో..

# ఉత్తరాంధ్రకు మణిహారం భోగాపురం

- ఉత్తరాంధ్ర దశ, దిశను మార్చే శక్తి విమానాశ్రయానిదే: చంద్రబాబు
- 2027 నాటికి పోలవరం.. 2028 నాటికి అమరావతి తొలి దశ పూర్తి
- రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 189 ప్రాజెక్టుల లక్ష్యం
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రధాని మోదీ సహకారం కీలకమని ప్రశంస

భోగాపురం, ఆగస్టు 1 భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం లాంటిదని, ఈ ప్రాంత దశ, దిశను మార్చే శక్తి దీనికి ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విమానాశ్రయం ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతూ ఒకప్పుడు ఈ ప్రాంతానికి ఎర్ర బస్సు కూడా రాదని ఎగతాళి చేసిన వారు ఇప్పుడు

➢ మిగతా 2వ పేజిలో..



## భోగాపురం అభివృద్ధికి నాంది: పవన్

- ఉత్తరాంధ్రకు కొత్త దిశ చూపనున్న అంతర్జాతీయ విమానాశ్రయం
- మోదీ, చంద్రబాబు నాయకత్వాన్ని కొనియాడిన ఉప ముఖ్యమంత్రి
- కూటమి ప్రభుత్వంతో రాష్ట్ర అభివృద్ధి వేగవంతమైందని వ్యాఖ్య
- ప్రధాని వెనుక దేశ ప్రజలు నిలవాలని పిలుపు



➢ 2వ పేజిలో..

ఆహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని మంత్రి వివరించారు. తల్లి పాల వారోత్సవాలను కేవలం అధికారిక కార్యక్రమాలుగా కాకుండా ప్రజల్లో చైతన్యం కలిగించే ఉద్యమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, గ్రామాలు, వార్డుల్లో అవగాహన సమావేశాలు, ఇంటింటి సందర్శనలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించి తల్లిపాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు.

తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ శాస్త్రీయ అవగాహన కల్పించాలని, కుటుంబ సభ్యులను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని మంత్రి కోరారు. ప్రతి ఆసుపత్రిలో ప్రసవం జరిగిన గంటలోపే శిశువుకు తల్లిపాలు అందేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. పోషకాహార లోపం లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క తెలిపారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు, వైద్యులు, మహిళా సంఘాలు, అంగన్వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ప్రతి కుటుంబం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించేలా సమాజమంతా బాధ్యతతో ముందుకు రావాలని కోరారు.

# ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛాయుత మీడియా అవసరం



రోజురోజుకూ క్షీణిస్తోందని కేటీఆర్ అన్నారు. మీడియా సంస్థలు తమ ఉనికిని కాపాడుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, అనేక సంస్థలు ఏదో ఒక వర్గానికి మద్దతుగా వ్యవహరిస్తున్న పరిస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు. వార్తను వార్తగానే రాసే పరిస్థితి లేకుండా పోయిందని, తప్పు జరిగినా నిర్భయంగా చెప్పలేని పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. స్వేచ్ఛాయుత మీడియా, నిర్భయమైన జర్నలిజం ప్రజాస్వామ్యానికి అత్యంత అవసరమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. స్వేచ్ఛకు ఎలాంటి పరిమితులు ఉండకూడదని, నిజాలు చెప్పేవారిని నిర్బంధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రభుత్వంలో ఉన్నవారు విద్వేషపూరిత వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా వల్ల ప్రభుత్వాల్లో జవాబుదారీతనం పెరిగిందని కేటీఆర్ అన్నారు. యువత సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తూ మార్పును కోరుతోందని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ పార్టీలు కూడా మారాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను తప్పనిసరిగా వాస్తవ నిర్ధారణ చేసి మాత్రమే ప్రచారం చేయాలని సూచించారు.

ప్రగతి భవన్, ప్రాజెక్టుల వ్యయం, ఫోన్ ట్యాపింగ్ తదితర అంశాలపై గతంలో తప్పుడు ప్రచారం జరిగిందని కేటీఆర్ ఆరోపించారు. అలాగే లగచర్ల ఘటన, హెచ్‌సీయూ భూముల వ్యవహారం, కేంద్ర మంత్రికి సంబంధించిన ఆరోపణలు వంటి అంశాలకు తగిన స్థాయిలో ప్రచారం లభించలేదని విమర్శించారు. ఒక రీట్వీట్ చేసిన వ్యక్తిని జైలుకు పంపడం వంటి ఘటనలను కూడా ప్రస్తావించారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛను పరిరక్షించడం అత్యంత కీలకమని కేటీఆర్ అన్నారు. మంచి విషయాలను మంచిగా, చెడు విషయాలను చెడుగా ప్రజల ముందుంచే బాధ్యత మీడియాపై ఉందని పేర్కొన్నారు. కొత్త తరం ప్రశ్నించే ధోరణిని ప్రోత్సహిస్తూ, బాధ్యతాయుతమైన మీడియా వ్యవస్థ దేశానికి అవసరమని అన్నారు.

# భోగాపురం అభివృద్ధికి నాంది: పవన్

భోగాపురం, ఆగస్టు 1 : ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం సరికొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో రాష్ట్రం దేశంలో అగ్రగామిగా ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం "వికసిత్ భారత్" లక్ష్యంతో వేగంగా ముందుకు సాగుతోందని పవన్ కల్యాణ్ అన్నారు. 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు మోదీ నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కూడా అన్ని రంగాల్లో దేశాన్ని పురోగతి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో "ఎర్ర బస్సు కూడా రాని చోట ఎయిర్‌బస్ అవసరమా?" అంటూ విమర్శించిన వారికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయమే సమాధానమని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలక కేంద్రంగా మారుతుందని, ఉపాధి, పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలు తీసుకువస్తుందని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో మూడు పార్టీలు కలిసి పనిచేయడం వల్ల అభివృద్ధి మరింత వేగవంతమైందని పవన్ కల్యాణ్ తెలిపారు. ఇదే అభివృద్ధి కోసం 2024 ఎన్నికల్లో ప్రజల మద్దతు కోరినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర ప్రయోజనాలే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై గతంలో చేసిన విమర్శలు తనను బాధించాయని పవన్ కల్యాణ్ అన్నారు. ఎన్ని విమర్శలు, అవమానాలు ఎదురైనా మోదీ వెనక్కి తగ్గకుండా దేశం కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. తనను విమర్శించిన వారిని కూడా క్షమించే గొప్ప మనస్తత్వం ప్రధాని మోదీదని పేర్కొన్నారు. దేశాభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెనుక ప్రజలంతా బలంగా నిలవాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని, ఉత్తరాంధ్రను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత ముందుకు తీసుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# లక్షల విలువైన యంత్రాలకు దిక్కెవరు?



ఆరుబయట ఉంచడం పట్ల ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇలాగే వదిలేస్తే యంత్రాల పరిస్థితి ఏమిటని రైతులు నిలదీస్తున్నారు.

### "యంత్రాలు చెడిపోతే బాధ్యులెవరు?"

ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసిన యంత్రాలు పాడైతే మరమ్మతుల కోసం మళ్లీ ప్రజాధనమే ఖర్చు చేయాల్సి వస్తుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి యంత్రాలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని రైతులు కోరుతున్నారు. రైతుల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి సౌకర్యాలు కల్పిస్తుంటే, వాటి నిర్వహణలో ఇంత నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

### పీఏసీఎస్ సీఈఓకు వివరణ అడిగితే..

వరి ధాన్యం కాంటాలు పూర్తి అయి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు వరి ధాన్యం క్లీనింగ్ యంత్రాలను ఇప్పటి వరకు ఎందుకు మార్కెట్ అధికారులకు తిరిగి అప్పగించాలేదని యంత్రాల పరిస్థితిపై పీఏసీఎస్ సీఈఓను వివరణ కోరగా, "మరో మూడు,నాలుగు రోజులకు పంపిస్తాం" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు సమాచారం. దీంతో విలువైన యంత్రాల భద్రతపై అధికారులు ఎంత సీరియస్‌గా ఉన్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### మార్కెట్ సెక్రటరీ ఏమన్నారంటే..

ఈ విషయంపై మార్కెట్ సెక్రటరీని వివరణ కోరగా, కాంటాలు పూర్తయిన వెంటనే వరి ధాన్యం క్లీనింగ్ యంత్రాలను తమకు అప్పగించాల్సి ఉంటుందని తెలిపారు. యంత్రాలను అప్పగించాలని పీఏసీఎస్ అధికారులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.

రైతుల కోసం ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి యంత్రాలను సమకూర్చితే, వాటిని కాంటా కేంద్రాల వద్దే వదిలేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

### అధికారుల నిర్లక్ష్యానికి ఎవరు బాధ్యులు?

ప్రభుత్వ ఆస్తుల సంరక్షణపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు వెంటనే దృష్టి సారించి, యంత్రాలను సురక్షిత ప్రదేశాలకు తరలించడంతో పాటు వాటి నిర్వహణపై స్పష్టమైన బాధ్యతలు నిర్ణయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. యంత్రాలు దెబ్బతిన్నా, పాడైనా.. నష్టానికి బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నకు అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

# తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగింపు

తిరుమల, ఆగస్టు 1 తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ శనివారం ఓ మోస్తరుగా కొనసాగుతోంది. వారాంతం కావడంతో భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతుండగా, టోకెన్లు లేని భక్తులు శ్రీవారి సర్వదర్శనం కోసం సుమారు 15 గంటల పాటు వేచి ఉండాల్సి వస్తోంది. ప్రస్తుతం 31 కంపార్ట్‌మెంట్లలో భక్తులు దర్శనం కోసం నిరీక్షిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. శుక్రవారం ఒక్కరోజే 71,393 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిలో 27,846 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం రోజంతా రద్దీగా కనిపించింది. భక్తుల కానుకల ద్వారా శ్రీవారి హుండీకి ఒక్కరోజులో రూ.4.46 కోట్ల ఆదాయం సమకూరినట్లు టీటీడీ వెల్లడించింది. భక్తుల విశ్వాసానికి నిదర్శనంగా హుండీ ఆదాయం కొనసాగుతోందని అధికారులు తెలిపారు.అదే రోజు 4.33 లక్షల శ్రీవారి లడ్డూలను విక్రయించినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. అలాగే 2.58 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నప్రసాద కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తిరుమలలోని వివిధ వైద్య కేంద్రాల ద్వారా 3,285 మంది భక్తులకు వైద్య సేవలు అందించినట్లు అధికారులు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్య బృందాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శనం, వసతి, లడ్డూ పంపిణీ, అన్నప్రసాదం, భద్రత తదితర ఏర్పాట్లను టీటీడీ మరింత పటిష్ఠం చేసింది. భక్తులు అధికారుల సూచనలు పాటిస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

# పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్ దెబ్బతింటోంది

అవుతోందని పేర్కొన్నారు. నిజాయితీగా చదువుకోవాలని విద్యార్థులకు చెబుతున్నప్పటికీ, వ్యవస్థ మాత్రం వారిపట్ల నిజాయితీగా వ్యవహరించడం లేదని రాహుల్ గాంధీ విమర్శించారు. పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటున్నా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. పేపర్ లీకేజీలతో నష్టపోయిన విద్యార్థులను లేదా వారి కుటుంబాలను ప్రధానమంత్రి ఇప్పటివరకు కలవలేదని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులను క్షమిస్తానని చెప్పడం కంటే, వారి భవిష్యత్తు దెబ్బతిన్నందుకు ప్రధాని దేశ విద్యార్థులకు క్షమాపణ చెప్పాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు.

పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విశ్వసనీయతను పెంపొందించేలా విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని రాహుల్ గాంధీ కోరారు. విద్యార్థుల భవిష్యత్తును రక్షించే దిశగా కేంద్ర ప్రభుత్వం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థుల కష్టం, వారి కుటుంబాల ఆశయాలను కాపాడే విధంగా పరీక్షల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. పేపర్ లీకేజీలను పూర్తిగా అరికట్టే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తు

- రాష్ట్రవ్యాప్తంగా ప్రక్రియ ప్రారంభిస్తున్న కాంగ్రెస్
- రేపు జిల్లాల్లో ఇన్‌చార్జి మంత్రుల సమావేశాలు
- ఆశావాహుల పేర్లను పీసీసీకి పంపాలని ఆదేశాలు
- పీసీసీ, సీఎం నిర్ణయాల మేరకే భర్తీ ప్రక్రియ: తుమ్మల



హైదరాబాద్, ఆగస్టు 1 రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలకు అనుగుణంగా నియామక ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆదివారం ఇన్‌చార్జి మంత్రులు సమావేశాలు నిర్వహించాలని మంత్రి తుమ్మల సూచించారు. ఈ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లా ఇన్‌చార్జిలు పాల్గొని సమన్వయంతో నామినేటెడ్ పోస్టులకు సంబంధించిన ఆశావాహుల పేర్లను ఖరారు చేయాలని తెలిపారు. ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలు పరస్పర సమన్వయంతో పనిచేసి అర్హులైన అభ్యర్థుల వివరాలను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి పంపించాలని మంత్రి ఆదేశించారు. పార్టీ బలోపేతం, సమర్థవంతమైన పాలన లక్ష్యంగా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని కార్పొరేషన్ చైర్మన్ పదవులు, వివిధ నామినేటెడ్ పోస్టులు, సహకార సంఘాల పదవులు, డైరెక్టర్ల పోస్టులను దశలవారీగా భర్తీ చేయనున్నట్లు తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. అన్ని నియామకాలు పార్టీ నాయకత్వం నిర్ణయాలకు అనుగుణంగా ఉంటాయని తెలిపారు.నియామక ప్రక్రియలో పారదర్శకత, సమన్వయానికి ప్రాధాన్యం ఇస్తామని మంత్రి పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం పార్టీ నాయకత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు లభించేలా నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపడుతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. త్వరలోనే వివిధ కార్పొరేషన్లు, బోర్డులు, సహకార సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ పూర్తవుతుందని పేర్కొన్నారు.

# ఉత్తరాంధ్రకు మణిహారం భోగాపురం




కనుమరుగయ్యారని, నేడు అదే ప్రాంతానికి ఎయిర్‌బస్ రావడం అభివృద్ధికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. విమానాశ్రయం నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులు ఉత్తరాంధ్ర చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలికారని ముఖ్యమంత్రి కొనియాడారు. రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని తెలిపారు. విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం గర్వకారణమని పేర్కొన్నారు.

ఉత్తరాంధ్రకు చెందిన జీఎంఆర్ సంస్థ ఈ విమానాశ్రయాన్ని నిర్మించడం విశేషమని చంద్రబాబు అన్నారు. ఈ ప్రాజెక్టుకు తొలి అడుగులు వేసిన అశోక్ గజపతిరాజు, ప్రస్తుతం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా ఉత్తరాంధ్రకు చెందిన వారేనని గుర్తుచేశారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టులపై కూడా ముఖ్యమంత్రి స్పష్టత ఇచ్చారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధానమంత్రి చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, 2028 నాటికి అమరావతి రాజధాని తొలి దశ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ, రైల్వే జోన్, పోలవరం, అమరావతికి అవసరమైన సహకారం అందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.రానున్న రెండేళ్లలో ఉత్తరాంధ్రలో రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 189 ప్రాజెక్టులు తీసుకొచ్చి 5.57 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. అలాగే రూ.2,784 కోట్లతో ఎనిమిది ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న నేరడి బ్యారేజీకి కూడా అనుమతులు లభించాయని వెల్లడించారు. విశాఖపట్నం నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్‌ను అభివృద్ధి చేసి పర్యాటక, ఔషధ పరిశ్రమలను విస్తరిస్తామని చంద్రబాబు తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయం తెలంగాణ అభివృద్ధికి ఎలా దోహదపడిందో, అదే విధంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రను వేగవంతమైన అభివృద్ధి పథంలో నడిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకు వలసలు వచ్చే పరిస్థితి ఏర్పడుతుందని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# వివేక స్మారక కేంద్రం ప్రారంభం

మైసూరు రామకృష్ణ ఆశ్రమంలో వివేకానంద సాంస్కృతిక యువజన కేంద్రం ప్రారంభం

యువతకు స్ఫూర్తినిచ్చే కేంద్రంగా అభివర్ణన

గ్రంథాలయం, యోగా, ధ్యాన సదుపాయాలతో ఆధునిక నిర్మాణం



మైసూరు, ఆగస్టు 1: మైసూరులోని శ్రీ రామకృష్ణ ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్మించిన స్వామి వివేకానంద సాంస్కృతిక యువజన కేంద్రం--వివేక స్మారకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ, 1892లో స్వామి వివేకానంద మైసూరుకు విచ్చేసిన చారిత్రక ఘట్టానికి గుర్తుగా ఈ స్మారక కేంద్రాన్ని నిర్మించినట్లు తెలిపారు. యువతకు స్ఫూర్తినిచ్చే విధంగా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దడం అభినందనీయమని పేర్కొన్నారు.స్వామి వివేకానంద బోధనలు, ఆదర్శాలను భావితరాలకు చేరవేసే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువతలో సేవాభావం, నాయకత్వ లక్షణాలు, దేశభక్తిని పెంపొందించడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కేంద్రంలో ఆధునిక గ్రంథాలయం, తరగతి గదులు, యోగా, ధ్యాన మందిరాలు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. విద్య, ఆధ్యాత్మికత, వ్యక్తిత్వ వికాసానికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.స్వామి వివేకానంద ఆలోచనలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని, సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి సంస్థలు అవసరమని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్, శ్రీ గౌతమానందజీ మహారాజ్, స్వామి ముక్తిదానందజీ మహారాజ్, ఎంపీ యదువీర్ కృష్ణదత్త చామరాజ వాడియార్, ఎమ్మెల్యే హరీష్ గౌడ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బి.వై. విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి ఆగస్టు 1 వలిగొండ మండల పరిధిలో ఆరూరు గ్రామానికి చెందిన. మగ్రి నరసింహ అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాని కీర్తిశేషులు.తుమ్మల నరసయ్యసేవా సమితి. మత్స్యగిరి గుట్ట చైర్మన్ తుమ్మల శ్రీనివాస్.ఆధ్వర్యంలో 5 వేల రూపాయలు ఆర్థిక సాయం మరియు యాదవ సంఘం అధ్యక్షులు కసిరబోయిన లింగయ్య యాదవ్. 10 వేల రూపాయలు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండారు నరసింహారెడ్డి.చిలకమగ్రి కనకాచారి.వార్డు మెంబర్ ఆవుల బిక్షపతి,అంజయ్య. స్వామి.బత్తిని వెంకటేశం.సుంకి ఆనంద్. పాండాల యాదయ్య.వల్లపు నరసింహ.సంఘీ శంకరయ్య తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

## నవజాత శిశువుకు తల్లిపాలే రక్షణ కవచం

• జిల్లా సంక్షేమ అధికారి జె. స్వర్ణలత లేనినా



***భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఆగస్ట్ 1***
భద్రాద్రి కొత్తగూడెం బస్టాండ్‌లో తల్లిపాలిచ్చే గదిని జిల్లా సంక్షేమ అధికారి జె. స్వర్ణలత లేనినా ప్రారంభించారు. ఈ సందర్భంగా నవజాత శిశువుకు పుట్టిన తొలి గంటలోనే తల్లిపాలు పట్టించాలని, మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. అనంతరం రెండేళ్ల వయస్సు వరకు అనుబంధ ఆహారంతో పాటు తల్లిపాలు కొనసాగించడం తల్లి, బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. తల్లిపాలు శిశువును అనేక వ్యాధుల నుంచి రక్షిస్తాయని, తేనే, పంచదార వంటి మూఢనమ్మకాలతో ఇతర పదార్థాలు ఇవ్వకుండా తల్లిపాలకే ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, పోషణ అభియాన్, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, బాలింతలు పాల్గొన్నారు

## భద్రాచలం వద్ద గోదావరికి మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగింపు -- క్షేత్రస్థాయిలో కలెక్టర్ అంకిత్ పర్యటన



**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఆగస్ట్ 1**
భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం శనివారం ఉదయం 56 అడుగులకు చేరుకుని మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ప్రస్తుతం సుమారు 15.90 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. జిల్లా కలెక్టర్ అంకిత్ గోదావరి ఘాట్లు, కరకట్ట, భద్రాచలం--కూనవరం రహదారి వెంట వరద పరిస్థితులను పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని, బ్యారికేడ్లు ఏర్పాటు చేసి భద్రత కట్టుదిట్టం చేయాలని సూచించారు. ప్రజలు వరద నీటిలోకి వెళ్లకుండా, వదంతులను నమ్మకుండా అధికారుల సూచనలను పాటించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా ఫ్లడ్ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సూచించారు.

## డిసిసి బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని

**•(స్టే) ఘనపూర్ డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ఎండీ . మెహబూబీ**

**జఫర్గడ్ ప్రతినిధి, ఆగష్టు 1,(తరంగాలు):** మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి. నందు బ్యాంకింగ్ సేవలపై ప్రజల్లో చైతన్యం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించరు. గ్రామీణ ప్రజల్లో బ్యాంకింగ్ సేవల వినియోగం, పొదుపు అలవాట్లు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమన్ని నిర్వహించరు.బ్యాంకింగ్ సేవల వినియోగం, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రుణ సౌకర్యాలు, ఈ కేవైసీ ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్షిత భీమా, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, సైబర్ మోసాల నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలో ఓటీపీ, పిన్ వంటి వ్యక్తిగత వివరాలను ఎవరికీ తెలియజేయవద్దనిప్రజలకు అవగాహన కల్పించారు,రైతులు, మహిళలు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న పథకాలపై వివరించారు. బ్యాంకు అధికారులుఫీల్డ్ ఆఫీసర్ విశ్వనాథ్, సందీప్ ,జఫర్గడ్ పాక్స్ సెక్రెటరీ అంగడి భాస్కర్ ఈకార్యక్రమంలోపాల్గొన్నరు .ఘనపూర్ వైస్ చైర్మన్ ఒ జఫర్గడ్ మండల పార్టీ అధ్యక్షులు నూకల ఐలయ్య , మాజీ ఎంపీటీసీ ఇల్లందుల స్రవంతి ఒమొగిలి,గ్రామ ప్రజలు, రైతులు సంఘ సిబ్బంది,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# 2028 నాటికి ఎస్ఎల్ బి సి సొరంగం పూర్తి చేస్తాం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్గొండ, ఆగస్టు1, తరంగాలు:**
2028 ఆగస్టు నాటికి ఎస్ఎల్ బి సి సొరంగం ద్వారా నల్గొండ జిల్లాలోని నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తన లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రెండు రోజుల నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం అయన నల్గొండ, తిప్పర్తి మండలాలలో విస్తృతంగా పర్యటించారు. తిప్పర్తి మండలం పజ్జూరు గ్రామంలో గ్రామస్తులతో మంత్రి సమావేశమై మాట్లాడుతూ గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పజ్జూరు ఎర్రగండ్ల గూడెం మధ్యలో 30 కోట్ల రూపాయలతో 132 కె వి సబ్‌స్టేషన్ ను మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అంతేకాక పజ్జూరు గ్రామానికి 8 ఎంవిఏ ట్రాన్స్ఫార్మర్ ను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.132 కెవి సబ్ స్టేషన్ ద్వారా చుట్టుపక్కల 10 గ్రామాలలో విద్యుత్ సమస్య ఉండదని, అంతేకాక స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సొంత ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నదని, ఫజ్జూరు గ్రామంలో ఇంకా ఇండ్లు రాని వారి కోసం స్థలాన్ని పరిశీలించి ఎంపిక చేయాలని, ఇండ్లు లేని వారందరికీ అక్కడ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పారు. గ్రామానికి ఇదివరకే 30 ఇండ్లు మంజూరయ్యాయని, ఎర్రగడ్డలగూడెంలో బోర్లు కావాలని, డ్రైనేజీ సమస్య ఉందని, విద్యుత్ సమస్య ఉందని గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకురాగా, మూడు కోట్ల రూపాయలతో గ్రామానికి సబ్ స్టేషన్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎల్ నినో కారణంగా గ్రామంలో విద్యుత్, తాగు, సాగునీటి సమస్యలు ఉన్నాయని , ఒకవేళ ఇప్పటి వరకే ఎస్ ఎల్ బిసి సొరంగ మార్గం పూర్తయి ఉంటే ఈ ప్రాంతం మొత్తానికి సాగు నీరు అంది రెండు పంటలు పండేవని, గ్రామాలలో ఎలాంటి సమస్యలు ఉండేవి కాదని అన్నారు.ఎస్ఎల్ బిసీ ద్వారా సాగునీరు అందించడమే



తన ఆశయమని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. రైతు బాగుంటేనే అందరూ బాగుంటారని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 13 వేల కోట్ల రూపాయలతో హ్యాం రోడ్ల నిర్మాణాన్ని చేపట్టిందని, గ్రామాల నుండి మండలాలకు, మండలాల నుండి జిల్లా కేంద్రానికి లింకు రోడ్లన్నింటిని వేస్తున్నట్లు తెలిపారు.రెండు ,మూడు నెలల్లో ప్రతి గూడెంకు బీటి రోడ్డును వేస్తామని తెలిపారు.ఎర్రగడ్డలగూడెంలో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి 20 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. వెంకటాద్రిపాలెం గ్రామంలో ఇందిరమ్మ ఇంటిని మంత్రి పరిశీలించారు. ఇండ్లూరు గ్రామం లో 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామానికి 63 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. రోడ్లు బాగుంటే అభివృద్ధి అవుతుందని, ప్రజలకు ప్రయాణ సౌకర్యం తో పాటు, పరిశ్రమలు, మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపడతాయని, దీన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రవ్యాప్తంగా హ్యాం రోడ్లు చేపట్టినట్లు చెప్పారు. అంతేకాక మరో 7 వేల కోట్ల రూపాయలతో ఆర్ అండ్ బి రోడ్లు చేపట్టామని వెల్లడించారు. ఇండ్లూరు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. మామిడాల గ్రామంలో ఇందిరమ్మ ఇంటిని మంత్రి ప్రారంభించారు. అంతకుముందు ఎర్రగడ్డల గూడెంలో మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ద్వారా ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నదని, నల్గొండ జిల్లాలో ఇదివరకే 60 కోట్ల రూపాయలు మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరిగిందని, అర్హత ఉన్న వారందరికీ రేషన్ కార్డుతో పాటు, సన్న బియ్యం ఇస్తున్నామని చెప్పారు. 2007లో మొదలుపెట్టిన ఎస్ఎల్ బి సి సొరంగ మార్గం దురదృష్టవశాత్తు కూలిపోవడం జరిగిందని, అమెరికా నుండి బేరింగ్ లను తెప్పించి తిరిగి పనులు ప్రారంభించామని, 2028 ఆగస్టు నాటికి సొరంగాన్ని పూర్తిచేస్తామని, నిర్మాణం పూర్తయిన తర్వాత అతి పొడవైన ఎస్ ఎల్ బి సి సొరంగ మార్గం ప్రపంచంలోనే మొదటి సొరంగంగా నిలుస్తుందని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వం సొరంగ మార్గాన్ని పూర్తి చేయకపోవడం వలన తన కోరిక నెరవేరలేదని, శ్రీశైలంలో డెడ్ స్టోరేజీ ఉన్నప్పటికీ ఎస్ ఎల్ బి సి సొరంగం ద్వారా నల్గొండ జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందేదని అన్నారు.ఎస్ ఎల్ బి సి సొరంగం పూర్తి చేసినప్పుడే తన లక్ష్యం నెరవేరుతుందని, రైతుల సంక్షేమం కోసం తన సొంత నిధులతో ఎంఆర్పి కాలువల డీసిల్టింగ్, పైపుల పని చేపట్టామని, రైతులు బాగుంటేనే రైతు కూలీలు,ఇతరులు బాగుంటారని మంత్రి తెలిపారు.

స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి,నల్గొండ ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి, పంచాయతీరాజ్ ఈ ఈ గిరిధర్, ఆర్ అండ్ బి ఎస్ ఈ మోహన్ ,ఈఈ శ్రీధర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసిలు లక్ష్మయ్య గుమ్మల మోహన్ రెడ్డి ,విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ధనలక్ష్మి ,వివిధ శాఖల అధికారులు , మండల స్థాయి అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు మంత్రి వెంట ఉన్నారు జారీ చేసిన వారు సహాయ సంచాలకులు ,సమాచార శాఖ నల్గొండ.



## ఘనంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పోరిక సాయి శంకర్ జన్మదిన వేడుకలు



**కేసముద్రం ,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,ఆగస్టు.01,తరంగాలు:**
మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ తనయుడు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పోరిక సాయి శంకర్ జన్మదిన వేడుకలు



మహబూబాబాద్‌లోని ఎంపీ గారి క్యాంప్ కార్యాలయంలో బానోత్ వెంకన్న నాయక్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగాయి.?ఈ సందర్భంగా ఎంపీ పోరిక బలరాం నాయక్ సమక్షంలో సాయి శంకర్ కేక్ కట్ చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు సాయి శంకర్‌కు కేక్ తినిపించి, మిఠాయిలు పంచిపెట్టి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.?ఈ వేడుకల్లో మహబూబాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అల్లం గణేష్, యువజన కాంగ్రెస్ నాయకులు తోట అఖిల్, ముజ్జు షేక్, అలాగే కేసముద్రం మున్సిపాలిటీకి చెందిన ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు మరియు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# మోడల్ మార్కెట్ పై దృష్టి సారించాలంటున్న బిజెపి

- బిజెపి జిల్లా అధికారి ప్రతినిధి దోమల మహేశ్వర్





**ఇల్లందు ప్రతినిధి ఆగస్టు 1,( తరంగాలు):** ఇల్లందు పట్టణంలో కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన మోడల్ మార్కెట్ వ్యాపారులకు ఇబ్బందిగా తయారయింది. ఈ మధ్యనే కూరగాయల వ్యాపారులందరినీ సమన్వయపరచి మార్కెట్ ప్రారంభించడం జరిగిందని తెలిపారు. కానీ అందులోకి వెళ్లిన వ్యాపారులు మౌలిక వసతులు లేక,ఒక పద్ధతిగా నిర్మించని మార్కెట్ పట్ల అసంతృప్తి తో కొనసాగుతుండగానే కొంతమంది బడా వ్యాపారులు తిరిగి పాత మార్కెట్ లోకి ప్రవేశించడం తో ఒక్కొక్కరుగా పాత మార్కెట్ లోకి ప్రవేశించడం తో వివాదం నెలకొనడం దురదృష్టకరం. అసలు మార్కెట్ నిర్మాణమే సరిగా లేకపోవడం కమిషన్ ల కోసం నిర్మించిన మార్కెట్ గా ప్రజలు అభిప్రాయపడు తుండడం కూడా విధితమే, అయినా బయట సింగరేణి స్కూల్ తో పాటు వివిధ ప్రాంతాల్లో కూరగాయల విక్రయం జరగడం కూడా జరుగుతుంది. ఇలాంటి సమస్యలను పరిష్కరించ కుండా, పాత మార్కెట్లోని గృహాలను కూల్చే ప్రయత్నం చేయడం శోచనీయం అన్నారు. కూల్చే హక్కు మున్సిపాలిటీకి ఉందా.. అసలు మార్కెట్ నిర్మాణం సరిగా లేకుండా నిర్మించడం ఎవరి తప్పు.. అందుకు చిరు వ్యాపారులు ఎందుకు ఇబ్బంది పడాలి. వెంటనే ఇల్లందు శాసనస భ్యులు,కమిషనర్ ఈ సమస్యకు పరిష్కారం చూపాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి,రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు. దోమల మహేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు.

# 6న ఇందిరాపార్క్ వద్ద జరిగే మహా ధర్నాను జయప్రదం చేయండి

- యస్ యఫ్ ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ




**జఫర్గడ్ ప్రతినిధి, ఆగస్టు 1,(తరంగాలు):** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లి వెంటనే విడుదల చేయాలని, రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 6న హైద్రాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే మహా ధర్నాలిను జయప్రదం చేయాలని యస్ యఫ్ ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ పిలుపునిచ్చారు. భారత విద్యార్థి ఫెడరేషన్ జఫర్గడ్ మండల మహాసభ ఆదర్శ పాఠశాల లో జరిగింది. ఈ మహాసభ కు ముఖ్య అతిథి గా ఆమె పాల్గొని మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా లక్షలాది మంది యస్ సి , ఎస్ టి , బీసీ , మైనారిటీ విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని ఆరోపించారు. దీంతో వేలాది మంది విద్యార్థులు కాలేజీలకు ఫీజులు కట్టలేక చదువుకు దూరమయ్యే పరిస్థితి వచ్చిందని అన్నారు. రాష్ట్రానికి ఇప్పటివరకు పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో విద్యారంగం అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అందుకే ఈ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 6న ఉదయం 10 గంటలకు ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. మా ప్రధాన డిమాండ్లు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి. రాష్ట్రానికి వెంటనే పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించాలి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి, ఫీజుల పెంపును అరికట్టాలి,ఉద్యోగాల క్యాలెండర్ విడుదల చేయాలి. ఈ ధర్నాను విద్యార్థులు, యువకులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాల నాయకులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని దాసగాని సుమ కోరారు. అలాగే నూతన మండల కమిటీ 12 మంది తో ఎన్నుంకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లవకుమార్,, ఉపాధ్యక్షులు సాత్విక్ రెడ్డి, నాయకులు హార్షిత్,నర్సింహా,శివ, సంజన,వెన్నెల,విక్కీ,మహేష్,సబీర్తదితరులు పాల్గొన్నారు.

# కాచం కృష్ణమూర్తి స్ఫూర్తితో భూ పోరాటాలను ఉద్ధృతం చేద్దాం

- ఎస్ వీరయ్య సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు
- కామ్రేడ్ కాచం కృష్ణమూర్తి స్ఫూర్తితో భూ పోరాటాలను ఉధృతం చేద్దామని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య పిలుపునిచ్చారు



యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 1 శనివారం సిపిఎం మండల కార్యాలయంలో కొండే కిష్టయ్య అధ్యక్షతన జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశం సందర్భంగా కాచం కృష్ణమూర్తి 20వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసిన అనంతరం వీరయ్య మాట్లాడుతూ నాటి తెలంగాణ ంసాయుధ రైతాంగ పోరాటంలో వందలాది గ్రామాల్లో వేలాదిమంది పేదలకు ప్రభుత్వ బంజరాయి, పోరంబోకు,చెరువు శిఖం భూములను భూస్వాముల ఆధీనం నుండి ఎర్రజెండాలు పాతి ప్రజలకు పంచిపెట్టిన గొప్ప నాయకులు కాచం కృష్ణమూర్తి అన్నారు. ఆయన స్ఫూర్తితో నేడు భూమిలేని పేదలకు ప్రభుత్వ భూములను పంచి ఇండ్లు ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఇండ్లు ఇళ్ల స్థలాలు సాధించేందుకు పోరాటాలను నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచంలో అత్యధిక యువశక్తి కలిగిన దేశం భారతదేశం అని యువశక్తి సామర్థ్యాన్ని దేశ అభివృద్ధికి వినియోగించుకోవడంలో పాలకులు విఫలమయ్యారని నిరుద్యోగ కోరల్లో యువత చిక్కి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విభాగాల్లో లక్షల కొలువులు ఖాళీగా ఉన్నాయని ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానన్న హామీతో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం 12 ఏళ్లు గడుస్తున్న ఆమెను నెరవేర్చలేదని నేడు ఉద్యోగాల కోసం ప్రశ్నిస్తే వారిని దేశద్రోహులుగా చిత్రీకరించి ముద్రవేయాలని, ప్రయత్నం చేయడం వారి నియంతృత్వ పాలనకు నిదర్శమన్నారు. నేడు యువత దేశంపై తిరగబడి సాధించిన ఫలితం యువశక్తిని నిరూపించిందన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై యువత మరింత ముందుకు సాగి ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి. జహంగీర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన పెన్షన్లను వెంటనే పంపిణీ చేయాలని గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరగాలని, గతంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించలేదని విమర్శలు ఉన్నాయని,పెన్షన్ల విషయంలో ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడకుండా లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల ద్వారా జరపాలని డిమాండ్ చేశారు. ఇందిర ఇండ్ల రెండో విడత లబ్ధిదారులను వెంటనే గుర్తించి ఇండ్లను ప్రారంభించాలని మొదటి విడతలో ఇల్లు నిర్మాణం చేసుకున్న వారికి ఇప్పటికీ బిల్లులు పూర్తిగా చెల్లించలేదని వెంటనే పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, జిల్లా కమిటీ సభ్యులు గణపతి రెడ్డి, పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు,మండల కార్యదర్శి వర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్, మెరుగు వెంకటేశం, కందడి సత్తిరెడ్డి, వాకిటి వెంకటరెడ్డి, మండల కమిటీ సభ్యులు గాజుల ఆంజనేయులు, చీరక శ్రీశైలం రెడ్డి,కలుకూరి ముత్యాలు,కర్ణకంటి యాదయ్య,కవిడే సురేష్, దుబ్బ లింగం,బూడిద మనమ్మ, ప్రజా సంఘాల నాయకులు వేముల నాగరాజు,ఉండాటి పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.



# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**జఫర్గడ్ ప్రతినిధి, ఆగస్టు 1, (తరంగాలు):** మండల కేంద్రం వడ్డెగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మామిడాల ప్రభాకర్ మరణించగా వారి పార్థివా దేహానికి పూల మాలలు వేసి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాళులు అర్పించారు. అలాగే జఫర్ గడ్ మండలం తిడుగు గ్రామ సర్పంచ్ గోపు సోమయ్య తండ్రి గోపు మల్లయ్య ఇటీవల మరణించగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. గోపు సోమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మరణించగా వారి చిత్ర పటాలకు నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ కరుణాకర్ రావు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బిక్షపతి , రాజేష్ నాయక్,సుధాకర్ బాబు, అశోక్, యాదగిరి గౌడ్ , మార్కెట్ డైరెక్టర్ బాబు గ్రామ శాఖ అధ్యక్షులు అనిల్, రాజు, శ్రీను, రమేష్, పాషా, కృష్ణ మూర్తి,నవీన్,వివిధ గ్రామాల సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





THARANGALU DAILY NEWS

ఆదివారం, 02 ఆగస్టు, 2026

జాతీయ దిన పత్రిక

తరంగాలు


# అంగన్వాడీలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

- తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించిన అంగన్వాడీ టీచర్ శాంతి




**ఇల్లందు ప్రతినిధి ఆగస్టు 1,( తరంగాలు):** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కారేపల్లి మండలం, వెంకటీయ్య తండా గిద్దవారిగూడెం టు అంగన్వాడీ కేంద్రంలో శనివారం ఘనంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ జర్పుల శాంతి గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.పుట్టిన వెంటనే శిశువుకు ముర్రుపాలు పట్టించడం ఎంతో అవసరమని, పుట్టిన తొలి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఆమె సూచించారు.తల్లిపాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు ఉండటంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. తల్లిపాలు శిశువుకు తొలి ఆహారం, తొలి టీకా, ప్రకృతి ప్రసాదించిన అమృతమని పేర్కొన్నారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారు.ఈ సందర్భంగా తల్లులు తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగించుకోవాలని, శిశువుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ప్రతి తల్లి తల్లిపాలను తప్పనిసరిగా అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మం జిల్లాను అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేసి అమలు దశకు తీసుకురావాలి
- పర్యాటక అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష




**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** ఖమ్మం జిల్లాలోని చెరువులు, సరస్సులు, నదీ తీర ప్రాంతాలు సహా ప్రకృతి సిద్ధమైన నీటి వనరులను ప్రజలను ఆకర్షించే పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి, జిల్లాను రాష్ట్రంలోనే అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాలో చేపడుతున్న పర్యాటక అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలోని చెరువులు, నీటి వనరుల వద్ద ప్రతిపాదించిన పర్యాటక అభివృద్ధి పనులు, మౌళిక సదుపాయాల కల్పన, అందుబాటు లో ఉన్న భూమి, వివిధ ప్రాజెక్టుల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా కలకోట, చింతకాని, ముత్తారం,చిరుమర్రి, బయ్యారం,మాటూరు లేక్, వైరా,పాలేరు రిజర్వాయర్,మధిర రివర్ ఫ్రంట్, ఇనియాద్రమ్మ, జమలాపురం, మామనురు లేక్, నేలకొండపల్లి బౌద్ధ స్థూపం పర్యాటక అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టే ప్రతి పర్యాటక అభివృద్ధి కార్యక్రమం నీటి వనరుల పరిరక్షణకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులకు అవసరమైన భూమి అందుబాటులో లేకపోతే ప్రత్యామ్నాయ ఇంజినీరింగ్ పరిష్కారాలను అన్వేషించాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి పర్యాటక అభివృద్ధి ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేసి అమలు దశకు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.అవసరమైతే అభివృద్ధి కార్యక్రమాల కోసం భూసేకరణ చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు మెరుగైన పర్యాటక సదుపాయాలు కల్పించడంలో రాజీ పడబోమని పేర్కొన్నారు. మధిర రివర్‌ఫ్రంట్ అభివృద్ధి పనులు ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా, నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలోని సహజసిద్ధమైన నీటి వనరులను పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి అనుసంధానం చేస్తూ ఉపాధి అవకాశాలు, స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా ప్రణాళికలు రూపొందించా లని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్, టూరిజం ఎస్ఈ సరిత, జిల్లా టూరిజం అధికారి బి. సుమన్ చక్రవర్తి, టీజీటిడీసీ, సీపీఎస్‌ఏ ప్రతినిధులు ఎన్. రామకృష్ణ, ప్రవీణ్ కుమార్, స్మిత, హరికృష్ణ, ఎన్ఎస్ఎస్ సలావుద్దీన్, ఐ-క్యాడ్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇల్లందు పాత కూరగాయల మార్కెట్ అక్రమ కూల్చివేత ను ఖండించిన అఖిల పక్షం



**ఇల్లందు ప్రతినిధి ఆగస్టు 1,( తరంగాలు ):** ఇల్లందు పాత కూరగాయల మార్కెట్ ను నేటి తెల్లవారు జామున మున్సిపల్ అధికారులు, పోలీసులు బుల్డోజర్ తో వచ్చి స్వంత షాపులు కూల్చివేయడాన్ని సీపీఎం పార్టీ జిల్లా నాయకులు అబ్దుల్ నబీ, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్, మన్యం మోహన్ రావు, ఎస్కే ఖాదర్, కూల్చి వేతను నిలుపుదల చేశారు. అలాగే బీఆర్ఎస్ జిల్లా నాయకులు,గ్రంథాలయ జిల్లా మాజీ అధ్యక్షులు దిండిగల రాజేందర్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, కొక్కూ సారంగపాణి, బీజేపీ నేతలు మావునురి మాధవ్, గోపాలకృష్ణ,కూరగాయల వ్యాపారులు గౌస్,జాని,ఖాజా, రాజేష్,ఖాదర్,తదితరులు మార్కెట్ కూల్చివేత ను తీవ్రంగా ఖండిస్తూ వ్యతిరేకించారు



# సంత్ రవిదాస్ 650వ జన్మదినం సందర్భంగా ఆరు నెలల పాటు "సమరసతా సంకల్ప్ అభియాన్" నిర్వహణ




- -బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ దాసి నాగరాజు

**కుత్బుల్లాపూర్ ఆగస్టు 01 ( తరంగాలు )** మేడ్చల్ జిల్లా సంత్ రవిదాస్ 650వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆరు నెలల పాటు "సమరసతా సంకల్ప్ అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా షాపూర్ నగర్ బీజేపీ జిల్లా కార్యాలయంలో మేడ్చల్ అధ్యక్షులు కే సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ దాసి నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసి నాగరాజు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు , ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ ల ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్నామని..సంత్ రవిదాస్ బోధించిన సమానత్వం, సామాజిక న్యాయం, సోదరభావం, కుల వివక్ష నిర్మూలన వంటి విలువలను ప్రజల్లో మరింత బలంగా చాటిచెప్పేందుకు ఈ ప్రత్యేక అభియాన్ చేపట్టినట్లు తెలిపారు. భారతీయ జనతా పార్టీ మీద విపక్ష పార్టీలు అసత్య ప్రచారం చేస్తున్నారని.. వాటిని తిప్పుకొట్టి భారతీయ జనతా పార్టీని.. దళితులకు దగ్గర చేయాలనే ఉద్దేశంతో భక్తి ఉద్యమ కవి, సంఘ సంస్కర్త రవిదాస్ మహారాజ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను ఓటు బ్యాంకుగా చూస్తున్నాయి కానీ.. వారి సంక్షేమం పూర్తిగా విస్మరించని తెలిపారు.

2028లో ఏర్పడే భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం.. అసలైన దళిత సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తున్నదని ధీమా వ్యక్తం చేశారు.ఆరు నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో సంత్ రవిదాస్ జయంతి కార్యక్రమాలు, సామాజిక సమరసత సమావేశాలు, అవగాహన సదస్సులు, యువతతో చర్చా వేదికలు, సేవా కార్యక్రమాలు, సామాజిక ఐక్యతను పెంపొందించే అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.సమాజంలోని ప్రతి వర్గాన్ని కలుపుకొని, వివక్షలేని సమరస సమాజ నిర్మాణమే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ విలేకరుల సమావేశంలో బిజెపి ఎస్సీమోర్చా సోషల్ మీడియా కన్వీనర్ పద్మిని, బిజెపి సూరారం డివిజన్ అధ్యక్షుడు కేశవ్ యాదవ్, జిల్లా కౌన్సిల్ నెంబర్ బలరాం, సీనియర్ నాయకులు కంది శ్రీరాములు, నాయకులు రాములు, స్వాతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# జఫర్గడ్ లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా మామిడాల పూర్ణచందర్



**జఫర్గడ్ ప్రతినిధి,ఆగస్టు 1, (తరంగాలు):** లయన్స్ క్లబ్ జఫర్గడ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నరహరి సుధాకర్ రెడ్డి ఆదేశానుసారం రెండవసారి నూతన కార్యవర్గం శుక్రవారం సాయంత్రం లైన్స్ క్లబ్ జఫర్గడ్ ఆర్యవైశ్య భవన్లోలో జరిగిన కార్యవర్గం ఏకగ్రీవంగాఎన్నుకోవడం జరిగింది. లైన్స్ క్లబ్ ఇన్స్టాలేషన్ ఆఫీసర్ జాన్ బన్నీ పీడీజీ వారు మాట్లాడుతూ మంచి పని కోసం డబ్బు డిపాజిట్ అంటే మానవసేవే మాధవసేవ అని అన్నారు. ఎన్నుకోబడ్డ ప్రతినిధులు కలిసికట్టుగా 2026, 2027 కార్యవర్గ సభ్యులు కలిసికట్టుగా సేవా కార్యక్రమాలు చేయాలని చెప్పారు.ప్రెసిడెంట్ మామిడాల పూర్ణచందర్ సెక్రటరీ ,అంచూరి యుగంధర్,ట్రెజరర్ మెరుగు బాలరాజు,



మామిడాల పూర్ణచందర్ నాకు రెండవసారి ప్రెసిడెంట్గా అవకాశాన్ని కల్పించిన లయన్స్ క్లబ్ జఫర్గడ్ ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ సే వే మార్గంగా ఈ సంవత్సరం ముందుకు నడుస్తానని స బాముఖంగా చెప్పారు.మొదటి వైస్ ప్రెసిడెంట్ రేవూరి రమేష్,రెండవ వైస్ ప్రెసిడెంట్ మంచాల ఎల్లయ్య,ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.క్లబ్ ఇన్స్టాలేషన్ చైర్మన్గా దాంశెట్టి సోమేశ్వర్,కో చైర్మన్ కర్క నరసింహారెడ్డి,మాస్టర్ చైర్మన్ అదిలాపురం మదన్మోహన్, ఈ కార్యక్రమంలో లయన్ చొప్పరి సోమయ్య, డీసీటీ లయన్ డ్యూటీ వెంకటసుబ్బయ్య, ఆర్ సి లయన్ గాజుల రఘు,జడ్ సి డాక్టర్ మల్లికార్జున్, క్లబ్బు ప్రతినిధులు పాల్గొన్నారు.రెండవ ఇన్స్టాలేషన్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

## పెద్ది స్వప్నను పరామర్శించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**నర్సంపేట, ఆగస్టు 1,తరంగాలు :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి శుక్రవారం పరమపదించగా, శనివారం వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య నల్లబెల్లిలోని వారి స్వగృహానికి చేరుకుని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి పెద్ది స్వప్నతో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యం కల్పించారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు బీజేపీ సమాయత్తం

- బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి
- మాజీ శాసనసభ్యుడు, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షుడు కొండేటి శ్రీధర్



**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 1,తరంగాలు** : రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ వరంగల్ జిల్లా కార్యాలయంలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత బలోపేతంపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గం మాజీ శాసనసభ్యుడు, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ.. బీజేపీ సంస్థాగత సమావేశాల ప్రధాన లక్ష్యం పార్టీని బూత్ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మరింత బలోపేతం చేయడమేనన్నారు. ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.సభ్యత్వ నమోదు, నాయకత్వ ఎంపిక, భవిష్యత్ కార్యాచరణ, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి బూత్ కమిటీని క్రియాశీలకం చేయడంతో పాటు కొత్త సభ్యులను పార్టీలోకి చేర్చుకోవాలని సూచించారు. పార్టీ అధ్యక్షుల ఎన్నిక ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తూ, జాతీయ, రాష్ట్ర నాయకుల మార్గదర్శకత్వంలో ఎన్నికల వ్యూహాలను రూపొందించుకోవాలని శ్రీధర్ సూచించారు.సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, డా. వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరీష్ శంకర్, బన్న ప్రభాకర్, మాజీ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, పంతిని సర్పంచ్ రామ్ భూపాల్, రాష్ట్ర నాయకులు రత్నం సతీష్ షాతో పాటు రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల స్థాయి నాయకులు, అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, పదాధికారులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండ నర్సయ్యకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నివాళి



**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 2,తరంగాలు** : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నల్గొండ రమేష్ తండ్రి నల్గొండ నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో వరంగల్ లోని సంరక్ష హాస్పిటల్లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హాస్పిటల్ కి వెళ్ళి మృతుడికి నివాళులు అర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్,వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు,సీనియర్ నాయకులు బాబురావు,తదితరులు పాల్గొన్నారు



# ఎల్ నీనో ప్రభావం ఉన్నా రైతులను ఆదుకుంటాం





### వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 1,తరంగాలు** : ఎల్ నీనో ప్రభావం ఉన్నప్పటికీ రైతులను ఆదుకుంటామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు.వర్ధన్నపేట మండల కేంద్రంలోని కోనారెడ్డి చెరువును వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు స్థానిక నాయకులు,అధికారులతో కలిసి సందర్శించారు.చెరువు ఆయాకట్ట వరకు కట్టపై నడుచుకుంటూ పరిశీలించారు. కొనారెడ్డి చెరువులో ఉన్న జలాల వల్ల వర్ధన్నపేట పరిసరాల ప్రాంతాల్లోని రైతుల వ్యవసాయానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఎల్ నీనో ప్రభావం ఉన్నప్పటికీ రైతులకు వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరలో ఈ చెరువు ద్వారా నీటిని విడుదల చేస్తామని అన్నారు. అధికారులు వెంటనే వ్యవసాయానికి సరిపడ సాగునీటిని విడుదల చేయాలని అదేశించారు.త్వరలో కాలువల ఇరువైల ఉన్న చెట్లను సంబంధిత శాఖ అధికారులతో సమన్వయంతో చేసుకొని పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు.చెరువును మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని ఈ చెరువు పరిశీలనకు తీసుకువచ్చి మరింత అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి,జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు,ఇల్లంద మార్కెట్ చైర్మెన్ నరకుడు వెంకటయ్య,ఐనవోలు దేవస్థానం చైర్మెన్ ప్రభాకర్ గౌడ్,పాక్స్ చైర్మెన్ కౌడగాని రాజేష్ ఖన్నా,మండల అధ్యక్షులు పోశాల వెంకన్న గౌడ్ ,పట్టణ అధ్యక్షులు ఈగ దామోదర్,జిల్లా ఉపాధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, సర్పంచ్ లు చిటూరి రాజు, దుబ్బ అంజయ్య, దశరథం, మార్కెట్, టెంపుల్ డైరెక్టర్ లు అల్లా కొమురయ్య, ఖీమా నాయక్, ఎస్సీ విభాగం మండల అధ్యక్షుడు దామెర ప్రశాంత్, మాజీ బ్లాక్ అధ్యక్షుడు అనిమీ రెడ్డి కృష్ణా రెడ్డి, మాజీ టౌన్ ప్రసిడెంట్ మైస సురేష్, మాజీ కో ఆప్షన్ నంబర్ ఎం డి అన్వర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు మరుపట్ల సాయికుమార్ కొండేటి బాలకృష్ణ, కొండేటి మహేందర్, శ్రీపాది సతీశ్, కొండేటి సాంబయ్య, తిరువెల్లి కుమారస్వామి, నేతవాత్ రాజేందర్, తుమ్మల రవీందర్, ఐత సుధాకర్, ఆరేల్లి ప్రభాకర్ గౌడ్, లింగం రజిత రెడ్డి, నంది పాక భాస్కర్, మెరుగు రమేశ్, అనీ మీ రెడ్డి రామచంద్రా రెడ్డి, పాలకుర్తి శ్రీకాంత్, విలసారపు వెంకట్, సింగారాపూ ఏలీయా నాయకులు,కార్యకర్తలు,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# ఆపరేషన్ ముస్కాన్‌లో 314 మంది చిన్నారుల రక్షణ

- వరంగల్ పోలీసుల ప్రత్యేక తనిఖీల్లో బాల కార్మికులకు విముక్తి
- బాల కార్మికులను పనిలో పెట్టిన యజమానులపై 55 కేసులు నమోదు
- బాల్యం బడిలోనే ఉండాలి.. పనిలో కాదు: పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత
- జూలై నెలంతా నిర్వహించిన ఆపరేషన్‌కు విశేష ఫలితాలు




**వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 1,తరంగాలు :** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై 1 నుంచి జూలై 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్-12లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ విశేష ఫలితాలు సాధించింది. ఈ ఆపరేషన్ ద్వారా మొత్తం 314 మంది చిన్నారులను బాల కార్మిక వ్యవస్థ నుంచి రక్షించినట్లు పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత వెల్లడించారు. రక్షించబడిన చిన్నారుల్లో 269 మంది బాలురు, 45 మంది బాలికలు ఉన్నారని కమిషనర్ తెలిపారు. వారిలో 226 మంది బాల కార్మికులు, 85 మంది పాఠశాల మానేసిన చిన్నారులు ఉన్నారని పేర్కొన్నారు. వీరిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచి, కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం కమిటీ ఆదేశాల మేరకు తల్లిదండ్రులకు అప్పగించినట్లు వివరించారు.బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా పారిశ్రామిక ప్రాంతాలు, దుకాణాలు, ఇటుక బట్టీలు, ఇతర ప్రమాదకర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు కమిషనర్ తెలిపారు. ఇందుకోసం కమిషనరేట్ పరిధిలోని తొమ్మిది సబ్‌డివిజన్లలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, తొమ్మిది మంది ఎస్ఐలు, 36 మంది పోలీసు సిబ్బందితో విస్తృతంగా తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్, కార్మిక శాఖ అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని సంయుక్తంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రక్షించబడిన చిన్నారుల్లో బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అస్సాం రాష్ట్రాలకు చెందిన 130 మంది చిన్నారులు ఉన్నారని పేర్కొన్నారు.బాల కార్మికులతో పని చేయిస్తున్న యజమానులపై కమిషనరేట్ పరిధిలో 55 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. అదనంగా కార్మిక శాఖ అధికారులు 92 తనిఖీ నివేదికలు నమోదు చేయగా, వివిధ పోలీస్ స్టేషన్ల జనరల్ డైరీల్లో 118 మంది చిన్నారుల వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. "పిల్లలు బడిలో ఉండాలి కానీ పనిలో కాదు. బాల్యానికి అండగా నిలవడమే ఆపరేషన్ ముస్కాన్ ప్రధాన లక్ష్యం. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవు" అని పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత హెచ్చరించారు. ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి చిన్నారుల భవిష్యత్తు పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

## జూలో రెండు జంతువులను దత్తత తీసుకున్న అన్నా కొణిదెల

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా కొణిదెల (అన్నా లెజినోవా) మరోసారి తన సేవా దృక్పథంతో ప్రశంసలు అందుకుంటున్నారు. గత కొంతకాలంగా సోషల్ మీడియాలో చురుకుగా ఉంటున్న ఆమె.. భారతీయ సంస్కృతి, సంప్రదా యాల పట్ల తనకున్న గౌరవాన్ని తరచూ పంచుకుంటూ అభిమానులకు మరింత చేరువవుతున్నారు. రష్యాలో జన్మించిన ప్పటికీ భారతీయ ఆచారాలను పాటిస్తూ పూజలు, పండుగలు, కుటుంబ వేడుకల్లో సంప్రదాయ దుస్తులతో కనిపించే అన్నా కొణిదెలకు ఇప్పటికే సోషల్ మీడియాలో మంచి ఆదరణ ఉంది. ఇప్పుడు ఆమె తీసుకున్న మరో నిర్ణయం అందరి ప్రశంసలను అందుకుంటోంది. తాజాగా అన్నా కొణిదెల హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని రెండు జంతువులను దత్తత తీసుకున్నారు. అందులో ఒకటి ఆసియా ఏనుగు, మరొకటి రాయల్ బెంగాల్ టైగర్. ఈ జంతువుల ఆహారం, వైద్య సంరక్షణతో పాటు ఇతర నిర్వహణ ఖర్చులను ఇకపై ఆమె భరిస్తారని సమాచారం. జూ పార్క్‌లో ఆయా జంతువుల వద్ద అన్నా కొణిదెల దత్తత తీసుకున్నట్లు ప్రత్యేక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఇంతకుముందు పవన్ కళ్యాణ్ కూడా విశాఖపట్నం జూలో జిరాఫీలను దత్తత తీసుకుని జంతు సంరక్షణకు తన వంతు సహకారం అందించారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో అన్నా కొణిదెల కూడా ముందుకు రావడం అభిమానులను ఆకట్టుకుంటోంది

# విద్యార్థులను అవమానిస్తే సహించం

సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలి రాజీనామా చేయాలని వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ డిమాండ్..

వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 1,తరంగాలు : తెలంగాణ విద్యా వ్యవస్థను నమ్ముకుని కష్టపడి చదువుకుంటున్న విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థులను అవమానించేలా మాట్లాడిన ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని, సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వరంగల్‌లోని వెంకట్రామ థియేటర్ జంక్షన్ వద్ద వరంగల్ జిల్లా బీజేపీ, బీజేవైఎం అధ్యక్షుడు ఎర్రగొల్ల భరత్ వీర్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సీఎం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.



ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని నిధులు, నియామకాలు, విద్యా--ఉద్యోగ అవకాశాల కోసం ప్రజలు, విద్యార్థులు ఎన్నో పోరాటాల అనంతరం సాధించుకున్నారని అన్నారు. ఎంతోమంది విద్యార్థుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణలో ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి విద్యార్థి లోకాన్ని కించపరిచేలా మాట్లాడటం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. తెలంగాణ ఇంజనీరింగ్ విద్యార్థులు, యువతను కించపరిచే పదజాలాన్ని ఉపయోగించడం సీఎం అహంకారానికి నిదర్శనమని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ విద్యార్థులు, ఇంజనీర్లు తమ ప్రతిభతో రాణిస్తూ రాష్ట్ర ఖ్యాతిని పెంచుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, యువతను ఏకం చేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల పక్షాన బీజేపీ, బీజేవైఎం నిరంతరం పోరాడుతాయని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షాతో పాటు జిల్లా పదాధికారులు, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మృతుల కుటుంబాలకు కొండేటి శ్రీధర్ పరామర్శ

**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 2,తరంగాలు** : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలువురు కుటుంబాలను వర్ధన్నపేట నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షులు కొండేటి శ్రీధర్ పరామర్శించారు. వర్ధన్నపేట పట్టణంలోని బీజేపీ 10వ వార్డు అధ్యక్షులు మల్లెపాక అనిల్ కుమార్ తల్లి మల్లెపాక లక్ష్మి (చంద్రయ్య సార్) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులను కలిసి శ్రీధర్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే వర్ధన్నపేట మాజీ వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలందర్ రెడ్డి తండ్రి కోమాండ్ల మల్లారెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుమారుడు ఎలందర్ రెడ్డిని కలిసి శ్రీధర్ పరామర్శించారు. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన తన మిత్రుడు సట్ల యాదగిరి గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను కూడా కలిసి శ్రీధర్ సానుభూతి తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమాల్లో వర్ధన్నపేట మండల బీజేపీ అధ్యక్షులు అడప రాజు, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి సత్యం, ఐత రవికుమార్, మల్లెపాక అనిల్, సట్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.





## 9న మహేశ్ బాబు పుట్టిన రోజు

**వారణాసి నుంచి అప్‌డేట్ కోసం అభిమానుల చూపు**

సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే నెల ఆగస్టు వచ్చేసింది. ప్రతి ఏడాది ఆగస్టు 9న మహేష్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో భారీ స్థాయిలో సందడి నెలకొంటుంది. ఈసారి కూడా అభిమానులు ఎస్ఎస్ఎంబీ మంత్ పేరుతో సెలబ్రేషన్స్ ప్రారంభించగా, అందరి దృష్టి ఇప్పుడు ఒకే విషయంపై ఉంది.. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వారణాసి' సినిమా నుంచి ఏదైనా ప్రత్యేక అప్‌డేట్ వస్తుందా అని చూస్తున్నారు. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలిచింది. అడ్వెంచర్ నేపథ్యంలో భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆసక్తి నెలకొంది. మహేష్ బాబు కూడా ఈ సినిమా కోసం పూర్తిగా కొత్త లుక్, ప్రత్యేకమైన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో కనిపించనున్నట్లు సమాచారం. చిత్ర బృందం ఇప్పటికే సినిమా షూటింగ్‌లో కీలక భాగాన్ని పూర్తి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం మరికొన్ని భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కొనసాగుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా లుక్ గోప్యంగా ఉండేలా రాజమౌళి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారని, అందుకే మహేష్ బాబు ఇటీవల కాలంలో పబ్లిక్ ఈవెంట్లకు కూడా చాలా తక్కువగా హాజరవుతున్నారని తెలుస్తోంది. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన సినిమాలకు సంబంధించిన పోస్టర్, టీజర్ లేదా గ్లింప్స్ విడుదల చేయడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా 'వారణాసి' నుంచి ప్రత్యేక అప్‌డేట్ ఉంటుందనే ఆశతో అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# సంగెం పోలీస్ స్టేషన్ తనిఖీ



- వార్షిక తనిఖీల్లో భాగంగా కమిషనర్ ఎన్. శ్వేత పర్యటన
- ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని పోలీసులకు ఆదేశం
- పెండింగ్ కేసులు, నేరాలపై సమగ్ర సమీక్ష
- పారదర్శకత,కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచన

**వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 1, తరంగాలు** : వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత శనివారం ఈస్ట్ జోన్ పరిధిలోని సంగెం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూర్ ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సీఐ రాజగోపాల్, సంగెం ఎస్ఐ వంశీకృష్ణ మొక్కను అందజేసి కమిషనర్‌కు స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ సాయుధ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. తదనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మామిడి మొక్కను నాటిన కమిషనర్, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బందికి ప్రభుత్వం అందించిన కిట్‌లు, స్టేషన్ రికార్డులు, స్టోర్ గదులను తనిఖీ చేసి నిర్వహణ తీరును సమీక్షించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమై శాఖాపరమైన అంశాలు, సమస్యలపై చర్చించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాల స్వభావం, పెండింగ్ కేసుల దర్యాప్తు, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలు, విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ తదితర అంశాలపై స్టేషన్ అధికారుల నుంచి కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారు, బాధితుడితో మర్యాదపూర్వకంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజల సమస్యలను పూర్తిగా తెలుసుకుని చట్టబద్ధంగా, వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం, భద్రతాభావం పెంపొందేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని, విధుల నిర్వహణలో అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పనిచేయాలని ఆదేశించారు. డయల్--100 ద్వారా వచ్చే అత్యవసర ఫిర్యాదులపై వెంటనే స్పందించి సంఘటన స్థలానికి త్వరగా చేరుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు.





విధుల నిర్వహణలో లేదా వ్యక్తిగతంగా ఏవైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూర్ ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సీఐ రాజగోపాల్, సంగెం, పర్వతగిరి, ఐనవోలు ఎస్ఐలు వంశీకృష్ణ, ప్రవీణ్, అశోక్ కుమార్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## టాక్సిక్ ట్రైలర్ 8న గ్రాండ్‌గా విడుదల




కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్డేట్ అందించారు. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా చిత్ర యూనిట్ తాజాగా ట్రైలర్ రిలీజ్ డేట్ ను అధికారికంగా ప్రకటించడంతో పాటు, ఒక సరికొత్త పోస్టర్ ను విడుదల చేసి సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చారు. గీతూ మోహన్ దాస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ సాలిడ్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే సినీ వర్గాలలో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. రీసెంట్ గా రామాయణ ప్రాజెక్ట్ తో పాటు రావణాసురుడి పాత్రలో యష్ గెటప్ మరియు ప్రెజెన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ సినిమా కంటే ముందే బాక్సాఫీస్ ముందుకు రాబోతున్న 'టాక్సిక్' తో యష్ ఏ స్థాయిలో విధ్వంసం సృష్టిస్తాడనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో తాజాగా విడుదల చేసిన బ్లాక్ అండ్ వైట్ పోస్టర్ సినిమా మూడ్ ఏంటో స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ పోస్టర్ తో పాటు మేకర్స్ అనౌన్స్ చేసిన వివరాల ప్రకారం, ఈ భారీ బ్జడెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమా ట్రైలర్ ను వచ్చే ఆగస్టు 8 న అత్యంత గ్రాండ్ గా లాంచ్ చేయనున్నారు. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి వంటి స్టార్ హీరోయిన్లు, నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ (మరియు మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్)సంయుక్తంగా అత్యంత భారీ బ్జడెట్ తో ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇక కేజీఎఫ్ లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత కేవీఎన్ ప్రొడక్షన్స్ తో యష్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్ పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి.

# కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత బాక్సర్ల విశ్వరూపం




## ఏడుకు పెరిగిన భారత్ స్వర్ణ పతకాల సంఖ్య

స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత బాక్సర్ల విజయ పరంపర కొనసాగుతోంది. శనివారం జరిగిన బాక్సింగ్ ఈవెంట్లలో ఇద్దరు బాక్సర్లు.. నిమిషాల వ్యవధిలో రెండు స్వర్ణ పతకాలను సొంతం చేసుకున్నారు. మొత్తంగా సుమారు గంట వ్యవధిలో భారత బాక్సర్లు మూడు పతకాలు సాధించి క్రీడాభిమానులను మురిపించారు. మహిళల విభాగంలో ప్రీతి పవార్ , జైస్మిన్‌లు పసిడి పతకాలతో మెరవగా, పురుషుల విభాగంలో జాదుమణి సింగ్ రజత పతకాన్ని ముద్దాడి భారత్ పతకాల పట్టికను మరింత ముందుకు తీసుకెళ్లారు. మహిళల విభాగంలో 22 ఏళ్ల యువ బాక్సర్ ప్రీతి పవార్ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఫైనల్ పోరులో చురుకైన కదలికలు, శక్తివంతమైన పంచ్‌లతో ప్రత్యర్థిపై విరుచుకుపడి విజయాన్ని అందుకుంది. ఈ కామన్వెల్త్ గేమ్స్ 2026 బాక్సింగ్ విభాగంలో భారత్‌కు మొట్టమొదటి స్వర్ణ పతకాన్ని అందించిన బాక్సర్‌గా ప్రీతి పవార్ నిలిచింది. ఫైనల్‌లో కెనడాకు చెందిన స్కార్లెట్ సవన్నా డెల్గాడోను ప్రీతి 5-0 తేడాతో మట్టికరిపించింది.

దీంతో ప్రీతి పవార్ ఫైనల్ మ్యాచ్‌ను వన్ సైడ్ చేసేసింది.ప్రీతి ఇచ్చిన జోష్‌తో బరిలోకి దిగిన ప్రపంచ ఛాంపియన్, ఆర్మీ బాక్సర్ జైస్మిన్ లంబోరియా తన అనుభవాన్నంతా ఉపయోగించి రింగ్‌లో ప్రత్యర్థికి చుక్కలు చూపించింది. పంచ్‌ల వర్షం కురిపిస్తూ ఏకపక్షంగా



సాగిన ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్‌లో నార్తర్న్ ఐర్లాండ్‌కు చెందిన మైఖేలా వాల్ష్‌పై జైస్మిన్ ఏకంగా 5-0 తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో నిమిషాల వ్యవధిలోనే భారత్ ఖాతాలో రెండు స్వర్ణాలు చేరాయి. జైస్మిన్ సాధించిన ఈ విజయంతో కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారతదేశం సాధించిన మొత్తం స్వర్ణ పతకాల సంఖ్య 7కు చేరుకుంది. మరోవైపు పురుషుల ఫైనల్లో పోరాడిన భారత బాక్సర్ జాదుమణి సింగ్ అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో చివరి వరకు పోరాడినప్పటికీ, స్వల్ప తేడాతో విజయాన్ని చేజార్చుకొని రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. మొత్తంగా గంట వ్యవధిలోనే భారత్ రెండు స్వర్ణాలు, ఒక రజతం సాధించింది.

# నా అటిట్యూడ్ వల్లే జట్టులో చోటు కోల్పోయా

- ఎప్పుడూ కెప్టెన్సీ కోసం ఆడలేదు..
- ఓ ఇంటర్వ్యూలో హార్దిక్ పాండ్యా ఆసక్తికర వ్యాఖ్యలు

కెరీర్ ప్రారంభంలో తన ఆట కంటే అటిట్యూడ్ నచ్చకనే జట్టు నుంచి తప్పించేవారని హార్దిక్ పాండ్యా తెలిపాడు. అప్పుడు తనకు ఈ విషయం తెలిసేది కాదని చెప్పుకొచ్చాడు. గాయంతో భారత జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యా.. బెంగళూరులోని బీసీసీఐ సెంట్రల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో రిహాబిలిటేషన్ తీసుకుంటున్నాడు. టీమిండియా తదుపరి వైట్ బాల్ సిరీస్‌లు ఆడేందుకు సిద్దమవుతున్నాడు.తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న హార్దిక్ పాండ్యా తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తాను ఎప్పుడూ కెప్టెన్సీ కోసం ఆడలేదని, జట్టు కోసమే ఆడానని తెలిపాడు. 'సారథ్యం విషయానికి వస్తే.. నాకు నేను ఎప్పుడూ సందేహించలేదు. ఎందుకంటే నేను ఎప్పుడు పదవులు కోసమో లేక నా మాట నెగ్గించుకోవడానికో ఆడను. నేను కెప్టెన్ కాకపోయినా జట్టులో నాయకుడిలాంటి వాడినని భావిస్తాను. జట్టులో నాది ఒక ప్రత్యేకమైన, ప్రభావవంతమైన పాత్ర అని నాకు తెలుసు. నేను చెప్పే మాటలను జట్టులో 11 మంది ఆటగాళ్లు వింటారు.నాయకుడిగా ఉండటానికి కెప్టెనే కానవసరం లేదనేది నా నమ్మకం. ఒక ఆటగాడిగా కూడా నాయకుడిగా ఉండవచ్చు. నేను చాలా అదృష్టవంతుడిని, కృతజ్ఞుడిని అని భావిస్తున్నా. నేను కెప్టెన్సీ కోసం ఎప్పుడూ ఆడలేదు. ప్రతి క్రికెటర్ కల దేశానికి ప్రాతినిథ్యం వహించడమే. కానీ కెప్టెన్సీ అనేది ఒక అదనపు గౌరవం. అయితే ఆ సంతోషం నాకు కొద్ది నిమిషాలు మాత్రమే నిలిచింది. ఆ తర్వాత జట్టును ఎలా మెరుగుపర్చగలననే ఆలోచించాను. ఆ సమయాన్ని నేను ఆస్వాదించాను. అయితే వాటిని నేను మనసుకు తీసుకోను. ఎందుకంటే అవి ఏ క్షణంలోనైనా మనల్ని విడిచివెళ్లిపోవచ్చు. ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడం నాకు ముఖ్యం కాదు. ఎందుకంటే అది నాకు అనవసరం. నా పనితో నేను సంతోషంగా ఉన్నానా లేదా? అన్నదే నాకు ముఖ్యం. నేను క్రికెట్ నుంచి బ్రేక్







తీసుకోవడానికి ప్రధాన కారణం నా మనసును ఉత్తేజపరుచుకొని, ఆ పాత ఉత్సాహాన్ని తిరిగి పొందడమే. కేవలం ఆటను ఆస్వాదించడానికే ప్రయత్నిస్తాను.నేను కష్టపడేది కేవలం నా కోసమే. నా సంతోషం, మనశ్శాంతి కోసమే, ఇతరుల కోసం కాదు. అంతా సవ్యంగా సాగినప్పుడు నేను విమర్శకులపై ప్రతీకారం తీర్చుకున్నానని అందరూ అనవచ్చు. కానీ అది నా ఉద్దేశం ఏ మాత్రం కాదు. నాకు నేను సంతృప్తి చెందడమే నా ఏకైక లక్ష్యం. నేను వచ్చిన నేపథ్యం. నా ప్రయాణం ఆధారంగా నేను ప్రత్యేకంగా నిలబడాల్సి వచ్చింది. నా వ్యక్తిత్వం మొదటి నుంచి పూర్తిగా భిన్నంగా ఉండేది. అందుకే నేను ఎదిగే క్రమంలో చాలా సమస్యలను ఎదుర్కొన్నాను.నాకు రంగురంగుల వస్తువులు అంటే ఇష్టం.నేను ఎప్పుడూ చురుకుగా.. హాస్య భరితంగా ఉండేవాడిని. నేను సాధారణ సాంప్రదాయ క్రికెటర్లలా కాకుండా.. కాస్త భిన్నమైన వ్యక్తిని. ఇప్పుడు అది నాకు అనుకూలంగా ఉండొచ్చు. కానీ తొలినాళ్లలో నన్ను చాలా జట్టు నుంచి తొలగించారు. పరుగులు చేయనందవల్ల కాదు.. నా అటిట్యూడ్ నచ్చకనే జట్టు నుంచి తప్పించేవారు. అప్పుడు అటిట్యూడ్ అంటే ఏంటో కూడా నాకు తెలియదు. దాని గురించి నాకేమీ అవగాహన కూడా లేదు.'అని హార్దిక్ పాండ్యా చెప్పుకొచ్చాడు.

# ఫైనల్లో తన్వి శర్మ

తైపీ సిటీ: భారత యువ షట్లర్ 17 ఏండ్ల తన్వి శర్మ తైపీ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో తన్వి21-17, 21-11తో లోకల్ షట్లర్, ప్రపంచ24వ ర్యాంకర్ హువాంగ్ యు-హుసున్‌ను చిత్తు చేసింది. కేవలం 33 నిమిషాల్లోనే ముగిసిన ఈ ఏకపక్ష పోరులో తన్వి బలమైన స్ట్రోక్స్, క్రాస్ కోర్ట్ స్మాష్‌లతో చెలరేగిపోయింది. మరో సెమీఫైనల్లో అథ్లెట్ ఉన్నతి హుడా15-21, 18-21తోప్రపంచ 21వ ర్యాంకర్ తుయ్ లిన్ ఎన్‌గుయెన్ (వియత్నాం) చేతిలో ఓటమి పాలైంది. ఆదివారం జరిగే ఫైనల్లో ఆరో సీడ్ ఎన్‌గుయెన్ తన్వి తలపడనుంది.



## రుమేష్ తారంగ పతిరగె సంచలనం

### రికార్డు త్రోతో పసిడి పట్టిన అథ్లెట్ రుమేష్




స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరిగిన కామన్వెల్త్ గేమ్స్ 2026 పురుషుల జావెలెన్ త్రో ఫైనల్లో శ్రీలంకకు చెందిన 23 ఏళ్ల యంగ్ అథ్లెట్ రుమేష్ తారంగ పతిరగె సంచలనం సృష్టించాడు. ఏకంగా 89.75 మీటర్ల దూరం జావెలిన్ విసిరి, ఒలింపిక్ ఛాంపియన్లు నీరజ్ చోప్రా, అర్షద్ నదీమ్‌లను ఓడించి పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. చిన్నతనంలో క్రికెట్ ఫాస్ట్ బౌలర్‌గా రాణించిన రుమేష్, తండ్రి ప్రోత్సాహంతో జావెలెన్ త్రో వైపు మళ్లి ఈ స్థాయికి ఎదిగాడు. జావెలెన్ త్రోలో నీరజ్ చోప్రాకు ప్రధాన పోటీదారుగా మారాడు.కామన్వెల్త్ గేమ్స్ 2026 పురుషుల జావెలెన్ త్రో అనగానే అందరి దృష్టి ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్‌లు భారత స్టార్ నీరజ్ చోప్రా, పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్‌లపైనే ఉంది. అయితే గ్లాస్గో వేదికగా శనివారం తెల్లవారుజామున జరిగిన ఫైనల్లో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ శ్రీలంకకు చెందిన 23 ఏళ్ల రుమేష్ తరంగ పతిరగె సంచలన ప్రదర్శన చేశాడు. ఫైనల్లో ఏకంగా 89.75 మీటర్ల దూరం ఈటెను విసిరి పసిడి పతకాన్ని ముద్దాడాడు. దీని ద్వారా కామన్వెల్త్ గేమ్స్ అథ్లెటిక్స్ విభాగంలో శ్రీలంక తరపున స్వర్ణ పతకం సాధించిన తొలి అథ్లెట్‌గా రుమేష్ రికార్డు క్రియేట్ చేశాడు. ఈ విభాగంలో నీరజ్ చోప్రా రజతం, భారత్‌కే చెందిన యశ్వీర్ సింగ్ కాంస్యం సాధించారు. దీంతో ఆసియా అథ్లెట్లు పోడియంను క్లీన్ స్వీప్ చేశారు. వాస్తవానికి 2026 సీజన్ ప్రారంభం నుంచే రుమేష్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. పర్త్ ట్రాక్ క్లాసిక్ గెలవడంతో పాటు, మార్చిలో 89.37 మీటర్లతో జాతీయ రికార్డు నమోదు చేశాడు. ఆ తర్వాత కెన్యాలోని కిప్ కేనో క్లాసిక్ గెలిచిన అతడు, రోమ్ డైమండ్ లీగ్‌లో ఏకంగా 92.62 మీటర్ల కళ్ళు చెదిరే త్రో విసిరి ప్రపంచ దృష్టిని ఆకర్షించాడు. ఈ సీజన్‌లో 90 మీటర్ల మార్కును దాటిన ఏకైక అథ్లెట్‌గా నిలిచాడు. ఆ తర్వాత ఓస్ట్రావా గోల్డెన్ స్పైక్, దోహా డైమండ్ లీగ్‌లలో కూడా విజయం సాధించి గ్లాస్గోలో అడుగుపెట్టాడు.అయితే కెరీర్ ప్రారంభం నుంచి రుమేష్.. జావెలిన్ త్రోయర్ కాదు. రుమేష్, కాలేజీలో చదువుతున్న రోజుల్లో క్రికెట్‌లో ఫాస్ట్ బౌలర్‌గా మంచి వేగంతో బంతులు విసిరేవాడు. సుమారు 130 కి.మీ వేగంతో బ్యాటర్లకు బంతులు సంధించేవాడు. కానీ స్వతహాగా డిస్కస్ త్రోయర్ అయిన తన తండ్రి ప్రోత్సాహంతో 2017లో జావెలెన్ పట్టాడు. ఆ నిర్ణయం అతడి జీవితాన్ని మార్చివేసింది. 2022 ప్రపంచ అండర్-20 ఛాంపియన్‌షిప్‌లో 7వ స్థానంలో నిలిచిన రుమేష్, ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో మైక్, కేల్సీ బార్బర్ అనే ప్రముఖ కోచ్‌ల శిక్షణలో తనను తాను మెరుగుపరుచుకున్నాడు. నిలకడగా 88 మీటర్లకు పైగా ఈటెను విసరడాన్ని అలవాటుగా చేసుకున్నాడు. ఇక గత కొన్నేళ్లుగా ఆసియాలో జావెలిన్ త్రోయర్లు అంటే.. నీరజ్ చోప్రా, అర్షద్ నదీమ్‌ల పేరే వినిపించేది. కానీ గ్లాస్గో విజయంతో రుమేష్.. ఆ కాంబినేషన్‌ను త్రిముఖ పోరుగా మార్చేశాడు. ఈ సీజన్ బెస్ట్ త్రో (92.62 మీటర్లు), కామన్వెల్త్ గోల్డ్ మెడల్‌తో ఉన్న రుమేష్, రాబోయే ఆసియా గేమ్స్‌లో నీరజ్ చోప్రాకు అతిపెద్ద సవాల్‌గా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది. ఒకప్పుడు ఫాస్ట్ బౌలర్‌గా ఉన్న కుర్రాడు, ఇప్పుడు ప్రపంచ జావెలెన్ రంగాన్ని శాసించే స్థాయికి ఎదిగాడు.

## విండీస్ టీమ్‌లో భగ్గుమన్న విభేదాలు!




వెస్టిండీస్ హెడ్ కోచ్ డారెన్ సామీపై ఆ జట్టు ఫాస్ట్ బౌలర్ అల్జారీ జోసెఫ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. తానేం డారెన్ సామీ తొత్తును కాదని, వెస్టిండీస్ ఆటగాడినని స్పష్టం చేశాడు. వ్యక్తిగత కక్షతో తన గురించి అవాస్తవాలు మాట్లాడటం డారెన్ సామీకి తగదని హితవు పలికాడు. తన గురించి అన్నీ తెలిసి కూడా ఎందుకు అసత్యాలు మాట్లాడాడో అర్థం కావడం లేదన్నాడు.డబ్ల్యూటీసీ 2027 ఎడిషన్‌లో భాగంగా సొంతగడ్డపై పాకిస్థాన్‌తో వెస్టిండీస్ రెండు టెస్ట్‌ల సిరీస్ ఆడుతోంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్‌ను వెస్టిండీస్ గెలిచి 1-0తో ఆధిక్యంలో నిలిచింది. అయితే ఈ సిరీస్‌కు అల్జారీ జోసెఫ్ దూరమయ్యాడు. వ్యక్తిగత కారణాలతోనే అల్జారీ జోసెఫ్ ఈ సిరీస్ ఆడటం లేదని వెస్టిండీ క్రికెట్ బోర్డు ప్రకటించింది. కానీహెడ్ కోచ్ డారెన్ సామీ మాత్రం భిన్నమైన కారణాన్ని చెప్పాడు. అల్జారీ జోసెఫ్ ఉద్దేశపూర్వకంగానే జట్టు సెలెక్షన్‌కు దూరంగా ఉన్నాడని, పాకిస్థాన్‌తో ఆడటానికి అతను నిరాకరించాడని తెలిపాడు. ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. పాకిస్థాన్ మీడియాతో పాటు అభిమానులు అల్జారీ జోసెఫ్‌పై విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించిన అల్జారీ జోసెఫ్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు. 'ఈ సిరీస్‌కు ముందు నేను మా హెడ్ కోచ్‌తో మాట్లాడాను. విండీస్ బోర్డుతో కూడా చర్చించాను. ఆ సమయంలోనే బోర్డు నేను వ్యక్తిగత కారణాల వల్ల దూరమయ్యానని ప్రకటించింది. అన్ని విషయాలు తెలిసి కూడా సామీ అలా ఎందుకు చెప్పాడో నాకు అర్థం కావడం లేదు. అతని వ్యాఖ్యలు ఎక్కడికి దారితీస్తాయో నాకు తెలుసు. నా గురించి తెలిసి కూడా ఇలా మాట్లాడటం ఎందుకు? నిజానికి ఈ ఏడాది నేను ఆటకు దూరంగా ఉన్నా. కండరాల నొప్పి కారణంగా నా శరీరం సహకరించడం లేదు. టెస్ట్ ఫార్మాట్ ఆడేందుకు నేను ఏ మాత్రం సిద్దంగా లేను. ఇవన్నీ తెలిసి కూడా సామీ నాకు వ్యతిరేకంగా మాట్లాడాడు.